క్లుప్తంగా

కోడ్ నెపంతో పనులు నిలపొద్దు

సిరిసిల్లటౌన్: ఎన్నికల కోడ్ నెపంతో సిరిసిల్ల పదో వార్డు పరిధిలోని పెద్ద చెరువు మరమ్మతు పనులు నిలపొద్దని కౌన్సిలర్ బొల్లం నాగరాజుగౌడ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. పెద్ద బోనాల చెరువు కట్ట మరమ్మతుల కోసం తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అనుమతులు వచ్చాయన్నారు. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారని అన్నారు. జూన్ 4 వరకు కోడ్ అమలులో ఉంటుందని, అప్పటివరకు పనులు జరగకుంటే వర్షాలతో వరద పోటెత్తి గతేడాది మాదిరిగా చెరువు పూర్తిగా దెబ్బతిని ప్రజలకు హాని కలుగుతుందన్నారు. కొన్ని మినహాయింపులతో టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

సీసీ కెమెరాలతో గ్రామాలకు రక్షణ


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న దేవానంద్

ముస్తాబాద్: ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని గ్రామాల రక్షణలో అందరూ భాగస్వాములు కావాలని స్వచ్ఛంద సేవ కార్యకర్త నాగెల్లి దేవానంద్ అన్నారు. కొండాపూర్‌లో రూ.40వేల వ్యయంతో దేవానంద్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా.. సోమవారం వాటిని ప్రారంభించారు. దేవానంద్ మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత వహించాలన్నారు. ముంబాయిలో ఉన్నత స్థితిలో ఉండి వ్యాపారంలో రాణించిన దేవానంద్ కొండాపూర్ అభివృద్ధికి ఇప్పటికే రూ.లక్షలు వ్యయం చేశారని గ్రామస్తులు అభినందించారు. ఆయనను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ లక్ష్మణ్, ప్యాక్స్ మాజీ వైస్ చైర్మన్ బొండ్యుగల దేవిరెడ్డి, బాల్‌రెడ్డి, వెంకన్న, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: తహసీల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ రామచంద్రం ప్రారంభించారు. స్థానిక ఒగ్గు కథా కళాకారుడు ఒగ్గు మల్లయ్యయాదవ్ జ్ఞాపకార్థం ఆయన మనుమరాలు ఒగ్గు శ్రీనిధి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాయకులు బండారి బాల్‌రెడ్డి, దూస శ్రీనివాస్, బాల్‌రాజ్‌యాదవ్, మల్లేశం, రమేశ్ పాల్గొన్నారు.

తేమ శాతం పరిశీలించాలి


కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వరి ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని తహసీల్దార్ ఉమారాణి, ఉప తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం భావుసింగ్‌నాయక్‌తండా గ్రామంలో సహకార శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే తేమ శాతం పరిశీలించాలన్నారు. ఆర్ఐ ప్రవీణ్, సహకార శాఖ సిబ్బంది, రైతులున్నారు.

బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

సిరిసిల్లటౌన్: అన్ని రాజకీయ పార్టీలు తమ పార్టీల అభ్యర్థుల నియామకంలో బీసీలకు ప్రాధాన్యమివ్వాలని ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొక్కుల భాస్కర్ అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెలాఖరులో సిరిసిల్లలో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


వేములవాడ బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

వేములవాడఅర్బన్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ అగ్నిమాపక శాఖ అధికారి కమలాకర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్, తిప్పాపూర్‌లోని వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రజలకు ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. ముంబై ఓడరేవులో జరిగిన అగ్ని ప్రమాదాన్ని అగ్నిమాపక దినోత్సవంగా జరుపుతూ ప్రమాదాల్లో మరణించిన వారికి నివాళి అర్పిస్తామని తెలిపారు. వారం రోజులపాటు నిరంతరం ప్రజలుండే షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్, బహిరంగ ప్రదేశాలు, ఆస్పత్రుల్లో ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తామన్నారు. అగ్నిమాపక సిబ్బంది రాజేంద్రప్రసాద్, మునీంద్రచారి, సురేష్, యాదయ్య, రాజశేఖర్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికం



కల్యాణం.. కమనీయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లిలోని శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణ వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రధానార్చకుడు బుగ్గ వాసుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారి గరుడసేవ, స్థాపిత పూజ, మూలమంత్ర హవనం, నవగ్రహ హవనం జరిపారు. మధ్యాహ్నం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. పందిర్ల సుజాత–సుధాకర్‌గౌడ్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు కృష్ణమూర్తిశర్మ, బుగ్గ శ్రీనివాస్‌శర్మ, నరహరిశర్మ, ఆంజనేయశర్మ కల్యాణం జరిపించారు. దొమ్మాటి నర్సయ్య, గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగంగౌడ్, రాజయ్య, బిచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసీతారామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పుణ్యాహవచనం నిర్వహిస్తున్న పండితులు

గంభీరావుపేట: మండల కేంద్రంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విశ్వక్‌సేవ ఆరాధన, పుణ్యాహవచనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. బుధవారం నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

రామాలయంలో అధ్యయనోత్సవాలు


బోయినపల్లి రామాలయంలో అధ్యయనోత్సవం

బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి పంచాహ్నిక కల్యాణోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి పండితులు అధ్యయనోత్సవాలు నిర్వహించారు. శ్రీరామ నామ పారాయణం చేశారు. పండితులు సముద్రాల అనంతరామాచార్యులు, నమిలికొండ నర్సింహాచార్యులు, ఆలయ అర్చకుడు కల్వకుంట్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


మామిడిపల్లిలో ముస్తాబవుతున్న రామాలయం

కోనరావుపేట: మామిడిపల్లి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 17న సీతారాముల కల్యాణ వేడుక వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24న ఉదయం 6 గంటలకు స్వామివారి రథోత్సవ కార్యక్రమం ఉంటుందని సభ్యులు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: జిల్లాలోని జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. సోమవారం కార్మికులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. చాలా మంది కార్మికులకు నెలల తరబడి జీతాలు రాక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు ఇస్తూ ప్రతినెలా 5వ తేదీన చెల్లించాలని కోరారు. నాయకులు కోడం రమణ, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్లయ్య, నర్సయ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారులపై ఆగ్రహం

- పనితీరు బాగా లేదని మండిపడ్డ ఎంపీపీ, ఎంపీడీవో


ఐసీడీఎస్ సూపర్‌వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

గంభీరావుపేట: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల పనితీరు బాగా లేదని, వైఖరి మార్చుకోవాలని ఎంపీపీ వంగ కరుణ, ఎంపీడీవో రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీల ప్రగతి నివేదికను సూపర్‌వైజర్లు పద్మజ, సంతోష చదివి వినిపించారు. ప్రతి నెల అంగన్‌వాడీ కేంద్రాలన్నింటినీ సందర్శించడం లేదని, అంగన్‌వాడీలపై పర్యవేక్షణ కరువైందని, ఐసీడీఎస్ చేపట్టే పోషణ్ పక్వాడ్ వంటి కార్యక్రమాల్లో ప్రజలను, అధికారులను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయడం లేదని, కనీస సమాచారమివ్వడం లేదని ఎంపీపీ, ఎంపీడీవో మండిపడ్డారు. వైఖరి మార్చుకోకుంటే శాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామని హెచ్చరించారు. కొన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ పైపులైన్లు వేయలేదని ఎంపీటీసీ సభ్యుడు రాజేందర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సభ్యులకు నివేదించారు. వైస్ ఎంపీపీ దోసల లత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఎంపీవో రాజశేఖర్, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, పలు శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఎంపీటీసీ అనసూయ, జిల్లా ఉపాధ్యక్షుడు అందె సుభాష్, మహిళా మండలాధ్యక్షురాలు అఫ్సర్ ఉన్నీసా, నాయకులు రాజం, సీత్యానాయక్, పర్శరాములుగౌడ్, కిషన్, సందీప్ పాల్గొన్నారు.

బీజేపీతో అందరి కుటుంబాలు బాగు


నాగారంలో ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వికాస్–దీప

కోనరావుపేట: బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే కేసీఆర్ కుటుంబం బాగుపడుతుందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే సోనియాగాంధి కుటుంబం బాగుపడుతుందని, కానీ నరేంద్ర మోదీకి ఓటేస్తే అందరి కుటుంబాలు బాగుపడతాయని బీజేపీ నాయకులు డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు–దీప అన్నారు. నాగారంలో సోమవారం ఇంటింటా బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూత్‌వారీగా తిరుగుతూ బీజేపీ చేసిన అభివృద్ధిని వివరించి ఈ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మండలాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాడి జ్యోతి, నాయకులు తీగల రవీందర్‌గౌడ్, బాస నారాయణ, మ్యాకల ప్రదీప్, అన్నవేణి రాములు, మ్యాకల రత్నాకర్, తీగల జయ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. నాయకులు మిర్యాల్‌కార్ రవి, చందుపట్ల లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: నీలోజిపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. నాయకులు కొనుకటి హరీశ్, జనగం లక్ష్మన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

గంభీరావుపేట: విజయ సంకల్ప అభియాన్ పేరుతో మండలంలో ప్రతి ఓటరు ఇంటికెళ్తూ బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సంకల్ప పత్రం అందించి స్టిక్కర్లు అంటించారు. మండల శాఖ అధ్యక్షుడు గంట అశోక్, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మీపురం రాజు, కోడె రమేశ్, పత్తి స్వామి, సర్వోత్తం, రవిగౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి(వేములవాడ): భారత్‌ను విశ్వ గురువును చేయడమే మోదీ లక్ష్యమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్ అన్నారు. ప్రధానిగా మోదీని, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సోమవారం రుద్రంగి మండల కేంద్రంలోని 96, 97 బూత్‌లలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు మీసాల రవీందర్, మ్యాకల శ్రీకర్, గడ్డం రవీందర్, పల్లి నితిన్, మంచె సంపత్, ఫణీంద్ర, నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఘనంగా పేదింట పెళ్లి


వివాహ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వధూవరుల బంధువులు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి ఎల్ల ప్రమీల వివాహం సోమవారం దాతల సహకారంతో ఘనంగా జరిగింది. రెండు సంవత్సరాల క్రితం తల్లి, తండ్రిని కోల్పోయి నిలువ నీడ లేకుండా ఉందని సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. ఇటీవల ఆ యువతికి పెళ్లి కుదిరిందని ఆ కథనాన్ని వాట్సప్, ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో పోస్టు చేసి దాతలు సహకరించాలని వైరల్ చేశారు. నా కలం అక్షర సత్యం అనే ఫేస్‌బుక్ అకౌంట్ వారు కూడా నిరుపేద యువతి పెళ్లికి సహకరించాలని పోస్టులు పెడుతూ వైరల్ చేశారు. స్పందించిన దాతలు సుమారు రూ.1.5లక్షల వరకు నగదు, వస్తువుల రూపంలో యువతి పెళ్లికి అందజేశారు. సోమవారం ప్రమీల పెళ్లి రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీబుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.

పెద్దమ్మ ఉత్సవాల్లో 'ఆది'

వేములవాడరూరల్: ఫాజుల్‌నగర్ గ్రామంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం ముదిరాజ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కులస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధానంలో ప్రత్యేక పూజలు, ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండి వర్షాలు మంచిగా కురవాలని వేడుకున్నారు. ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, ఎంపీటీసీ రంగు వెంకటేశ్‌గౌడ్, అర్బన్ అధ్యక్షుడు పిల్లి కనకయ్య తదితరులున్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి పెద్దమ్మ తల్లిని సోమవారం విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి దంపతులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, మహిళా అధ్యక్షురాలు హారికారెడ్డి, కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, లింగాల భూపతి, మునిగెల రాజు, చెన్నమనేని ప్రశాంత్, గడ్డం మధుకర్(ఛోటు), ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు యూపీఎస్సీ ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ 2025 పరీక్ష కోసం అర్హులైన మైనార్టీ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ఆర్వీ రాధాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూనే మొత్తం 100 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ద్వారా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం ఏడాదికి రూ.5 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులైన మైనారిటీ యువత ఈనెల 22లోపు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను పంపించాలన్నారు. 28న మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో అర్హత పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎన్‌హెచ్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

సిరిసిల్లటౌన్: ఎన్‌హెచ్‌ఎంలందరినీ రెగ్యులర్ చేయాలని రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల ప్రతినిధులు కోరారు. సోమవారం సిరిసిల్ల కార్మిక భవనంలో నిర్వహించిన ఇరు జిల్లాల కార్యకర్తల సమావేశంలో ఆల్ కేడర్ ఎన్‌హెచ్‌ఎం ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్‌కన్నా మాట్లాడుతూ పనికి తగిన వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అర్బన్ బ్యాంక్ ఓటర్ల జాబితా సిద్ధం

సిరిసిల్లకల్చరల్: సహకార సంఘాల చట్టం ప్రకారం సవరించిన ఎన్నికల నియమావళిని అనుసరించి అర్బన్ బ్యాంక్ సభ్యుల ఓటరు జాబితాను రూపొందించినట్లు బ్యాంక్ సీఈవో తెలిపారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్ల పద్మశాలీ సంఘం నాయకులు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. సిరిసిల్ల పద్మశాలీ సంఘ భవన నిర్మాణానికి బీసీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన నిధులను విడుదల చేయించాలని మంత్రిని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు సోమవారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు.

తూకాలు ప్రారంభించాలి

కోనరావుపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకాలను వెంటనే ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. ధర్మారం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో సంబరాలు

కోనరావుపేట: కనగర్తిలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. అన్ని బ్రాంచుల్లో కలిపి రూ.24లక్షల కోట్ల బిజినెస్ పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బిల్లులు వెంటనే చెల్లించాలని ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ కోరారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ప్రెస్‌మీట్లో మాట్లాడారు.

ప్రైవేట్ అభ్యర్థులకు ప్రభుత్వ ఐటీఐ సర్టిఫికెట్

సిరిసిల్లకల్చరల్: ఐటీఐకి సంబంధించి ఏదేని ట్రేడ్‌లో అనుభవమున్న అభ్యర్థులకు సంబంధిత ట్రేడ్ పరీక్షలకు అనుమతి కల్పిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఏదేని ట్రేడ్‌కు సంబంధించిన ఒకటి రెండేళ్ల అనుభవమున్న అభ్యర్థులు ఆ ట్రేడ్‌లో సర్టిఫికెట్‌ను ఈ అవకాశం ద్వారా పొందొచ్చన్నారు.

28న గురుకులం ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఏకలవ్య మోడల్ గురుకులం పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వరంగల్ రీజినల్ గురుకులాల కోఆర్డినేటర్ వెంకన్న తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి 48 సార్లు ఆపద సమయంలో రక్తదానం చేయగా.. తెలుగు–వెలుగు సాహితీవేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గాన సభలో మహానంది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గిరిధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

దేవయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేట: రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన భీమరి దేవయ్య అనే ముదిరాజ్ కులస్తుడు ముంజలు కోయడానికి తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

కాంగ్రెస్ పాలనలో అన్నదాతకు కష్టాలు

ముస్తాబాద్: కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు ఆరోపించారు. ముస్తాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు.

నేడు రాత్రింబవళ్లు రాజన్న దర్శనం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 17న సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఈనెల 16న రాత్రింబవళ్లు రాజన్న దర్శనాలను కొనసాగిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సోమవారం పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమం కోసం కేంద్ర పథకాలు

వేములవాడ: ప్రజా సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలు అందించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. పట్టణంలో సోమవారం ఇంటింటా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు.

'అప్పుల కుప్పగా మార్చారు '


కోనరావుపేట: కండువా వేస్తున్న ఎమ్మెల్యే ఆది

రుద్రంగి(వేములవాడ): బీజేపీ ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన జన్‌ధన్ ఖాతాల్లో ధన్‌ధన్ మనీ ఏమైందని, ఇప్పటివరకు ఒక్క బీద ఖాతాలో కూడా రూ.15లక్షలు ఎందుకు జమ చేయలేదని విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. అభివృద్ధి చేస్తారని నమ్మి ప్రజలు అధికారమిస్తే.. దేశాన్ని మోదీ ప్రభుత్వం, రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చాయని ఆరోపించారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ దేశ ప్రజలను విడదీసి అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు.

కొనసాగుతున్న చేరికలు

రుద్రంగి మండల బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. రుద్రంగి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొమిరె శంకర్, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు, సింగిల్‌విండో డైరెక్టర్ కేసిరెడ్డి నర్సారెడ్డి ఇంతకుముందే కాంగ్రెస్ పార్టీలో చేరగా.. సోమవారం రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచులు, పలువురు నాయకులు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కోనరావుపేట: మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ దేవరకొండ నర్సింహాచారి, సింగిల్‌విండో డైరెక్టర్ కరెడ్ల రమేశ్‌రెడ్డితోపాటు 50 మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు చందనగిరి గోపాల్, గొట్టె శంకర్, గడిపెల్లి ఎల్లయ్య, ముదాం ప్రదీప్, తాళ్లపల్లి ప్రభాకర్, యాస శంకర్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: బీజేపీ చేస్తున్న కరపత్రాల ప్రచారంలో వాస్తవం లేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు బుచ్చాగౌడ్, బాబు, రాజు, దేవయ్య, బండారి బాల్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెట్లు దగ్ధం

కోనరావుపేట: కనగర్తిలో ప్రమాదవశాత్తు చెట్లు కాలిపోయాయి. గ్రామ శివారులోని దళితులకిచ్చిన భూమి సమీపంలో మాదం పద్మాకర్ చేను దగ్గర ఉన్న చెట్లకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఉప్పుల రాజుకు చెందిన సుమారు 50 చింత చెట్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రైతులు వేములవాడలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారమందించగా.. ఫైర్ వాహనం వచ్చి మంటలార్పింది.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా.. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గంజాయి నిర్మూలన స్పెషల్ డ్రైవ్‌ను ఎస్సై ఎల్.రాజు ఆధ్వర్యంలో చేపట్టగా.. అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను మంగళవారం అరెస్టు చూపే అవకాశముంది.

ఆర్థిక సాయం అందజేత

సిరిసిల్లటౌన్: ఇటీవల దర్జీ వృత్తి చేస్తూ నిరుపేద తెంబరవేణి లావణ్య మృతిచెందింది. సోమవారం మేర కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓదెల శ్రీనివాస్ మృతురాలి భర్త రమేశ్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుల పెద్దలు చంద్రయ్య, లక్ష్మణ్, స్వామి తదితరులున్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): మోటారు సైకిల్‌పై నుంచి కింద పడి యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లెకు చెందిన సెట్‌పల్లి సాయి, అతడి స్నేహితుడితో కలిసి సోమవారం నర్సింగపూర్ గ్రామానికి వెళ్లి వస్తుండగా.. మూడపల్లి క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. సాయి అనే యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో.. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని బంధువులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: రామలక్ష్మణపల్లె మానేరు వాగు నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మహేశ్‌కు చెందిన ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించామన్నారు.

కాంగ్రెస్ పార్లమెంట్ అడిషనల్ ఇన్‌చార్జిగా రవీందర్



బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మండలంలోని నీలోజిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కూస రవీందర్‌ను కరీంనగర్ పార్లమెంట్ అడిషనల్ ఇన్‌చార్జిగా నియమిస్తూ టీపీసీసీ ఓబీసీ కమిటీ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ సోమవారం ప్రకటన జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు పురమల్ల శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి, ప్రణవ్‌బాబుకు కూస రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.